2

# జల ప్రళయము తరువాత కాలము

## జల ప్రళయమునుండి అబ్రాహాము పిలువబడువరకు, క్రీ.పూ. 2348-1921 (ఆది. 8:10-11:26)

**1. రెండవ ప్రారంభము** (ఆది. 8:15-9:29). – మానవ జాతికి ఓడ రెండవ ఊయలగా రూపొందింది. దానిలోనుండి నోవహును అతని కుటుంబమువారును నూతనమైన (ప్రొబేషన్) పరీక్షా కాలానికి వెళ్లారు.

ఎ. బలిపీఠము, నిబంధన. – పవిత్రమైన జంతువులలో ప్రతి జాతినుండి ఏడింటిని నోవహు భద్రపరిచాడు. ఓడలోనుండి అతడు బయటికి వెళ్లిన తరువాత చేసిన మొదటి పని దేవునికి బలిపీఠమును కట్టి, పవిత్రమైన జంతువులలోను, పక్షులలోను దేవునికి బలి అర్పించడమే. అతని ఆరాధనను అంగీకరించడంలో, దేవుడు నోవహుతో ఒక నిబంధన చేయడం జరిగింది, మరియు అందమైన వాగ్దాన ధనస్సుతో ఆయన దానిని ముద్రించాడు. ఆ నిబంధనలోని ముఖ్యాంశాలు: (1) ఇక మీదట జల ప్రళయం లేదు; (2) నరుడు విస్తరించి భూమిని నిండించాలి; (3) జంతు ఆహారము స్థిరం చేయబడింది; (4) హత్యకు మరణదండన విధింపబడడంతో మానవ జీవితం యొక్క విశిష్టత అమలు చేయబడింది.

బి. నోవహు కుమారులయొక్క గమ్యం. – నోవహు జీవితపు చివరి సంఘటనల్లో అతడు ద్రాక్షారసముచే మత్తుడవ్వడం ఒకటి, హాము యొక్క సిగ్గులేని అగౌరవము, షేము, యాపెతుల ఎక్కువైన మర్యాదతో కూడిన ప్రవర్తనలు ఉన్నాయి. అందులో ఉన్న సహజమైన తారతమ్యమే వారి భిన్నమైన గమ్యాలను ప్రవచన రూపంగా చిత్రించే సందర్భంగా ఏర్పడింది: (1) కనాను, అంటే హాము సంతతి శపింపబడుతుందని, (2) షేము దీవించబడతాడని, (3) యాపెతు విస్తరించుతాడని ప్రవచింపబడింది.

**2. జనముల ఆరంభము** (ఆది. 10). – ఆయా జనములను గూర్చిన ప్రాచీన అధికారము ఆదికాండము 10వ అధ్యాయమే. నోవహు కుమారుల వంశావళులు, వారు చెదరిన విధానాన్ని అది యిస్తుంది. (1) హాముకు నలుగురు కుమారులున్నారు, వారు యూఫ్రటీసు దిగువ భాగంలోను, నైలు లోయలోను స్థావరాలను ఏర్పరచుకొన్నారు. అతి ప్రాచీన నాగరికత హాము సంతతికి సంబంధించింది. (2) షేము యొక్క అయిదుగురు కుమారులు నైఋతి ఆసియాలో స్థిరపడ్డారు. వీరు యూఫ్రటీసు వద్ద హాము సంతతి వారిని జయించిన కల్దీయులు; వీరితో అష్షూరీయులు, సిరియనులు, అరేబీయులు, మరియు హెబ్రీయులు ఉన్నారు. తరువాత గొప్ప సామ్రాజ్య గుంపును స్థాపించిన వారు

వీరే. (3) యాపెతుకు ఏడుగురు కుమారులున్నారు, వీరినుండి మాదీయులు, గ్రీకులు, రోమీయులు మరియు ఐరోపా నవ జాతుల వారందరును వచ్చారు. వీరు ఎక్కువగా చెదరి విస్తరించినా, వేల సంవత్సరాలు గుర్తింపులేకయే ఉన్నారు, అయితే ఇరవైనాల్గు వందల సంవత్సరాలుగా వారు లోకాన్ని ఏలుతున్న జనమైయున్నారు.

**3. బాబెలు గోపురం, భాషలు తారుమారు** (ఆది. 11:1-9). – శతాబ్దాలు గతించిపోయాయి. యూఫ్రటీస్ దిగువ భాగంలో షీనారునొద్ద జనాభా కేంద్రీకృతమవ్వడం ఆరంభమయ్యింది. గొప్ప పేరు సంపాదించడం, చెదరిపోవడాన్ని అరికట్టడం అనే ద్వంద్వ ఉద్దేశంతో జనులు గొప్ప గోపురాన్ని కట్టనారంభించారు. నోవహుతో చేసిన దేవుని నిబంధనలో, జనులు విస్తరించి, భూమిని నిండించడమనేది ఆయన ఏర్పాటైయుంది. అందువలన వారి పాపం వారి గోపురములలో లేదు, అది వారి హృదయాల్లో ఉంది. భాషలను తారుమారు చేయడంలో దేవుడు జనుల ఉద్దేశాన్ని రద్దుపరచాడు, అది వారిని చెదరగొట్టింది; అందువలన అది తారుమారు, బాబెలు అనబడింది.

**4. షేము యొక్క వంశావళి** (ఆది. 11:10-26). – ఈ వచనాలు అయిదవ అధ్యాయము యొక్క ప్రతి రూపమును, సంపూర్ణతయునైయున్నాయి. అది ఆదాము నుండి నోవహుతో కలిపి షేతు వంశావళిని (గీతను) యిస్తుంది. ఇదైతే షేము యొక్క సారను షేమునుండి అబ్రాహామువరకు యిస్తుంది. ప్రతి లైనులోను పది పేర్లున్నాయి. ఈ వంశావళుల పట్టీలు కేవలం కుటుంబ రిజిష్టర్ల కంటే మించినవై ఉన్నాయి. బైబిలు చరిత్ర యొక్క ప్రాథమిక ఉద్దేశంతో అవి సన్నిహితంగా కలుపబడతాయి. నిజమైన మతం ఎలా ఆరంభమై వృద్ధిచెందిందో దాని జాడ కట్టడమే దీని ఉద్దేశమైనట్టుంది. ఈలాటి అభివృద్ధి మొదట వాగ్దానపు సారను, ఆ సార తిరిగి విశ్వాసులైన మనుష్యుల సారను వెంబడిస్తుంది. ఆ వరుసలో వాగ్దానం చేయబడిన మెస్సీయా అనే నిరీక్షణా నక్షత్రం చాలా దూరంగాను కాంతిహీనంగాను ఉన్నా; హనోకు, నోవహు, అబ్రాహాముల వంటి కథా నాయకుల రూప చిత్రాలు ఆరంభ శతాబ్దాలలో ఉన్న (మనుష్యుల) స్థాయిని అధిగమించియుంది.